## ఉజ్వల భవిష్యత్తుకు..

# డ్యూయల్ డిగ్రీ పునాది

- పోటీ ప్రపంచంలో ముందస్తు ప్రణాళిక ఎంతో ప్రధానం
- లక్ష్యాన్ని నిర్దేశించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- ఉన్నత చదువులు, మెరుగైన ఉద్యోగావకాశాలు కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులకే సాధ్యం
- డిగ్రీ నాలుగేండ్లు కష్టపడి చదివితే.. 40 ఏండ్లు సుఖజీవితమే
- కేఎల్‌యూలో ఒకేసారి రెండు కోర్సులు చదివే అవకాశం
- విద్యార్థులకు ఐదు ఫారెన్ లాంగ్వేజీలపై ఉచిత శిక్షణ
- ఆన్‌లైన్-ఆఫ్‌లైన్‌లో జేఈఈ బేసిక్ ఎగ్జామ్
- కేఎల్ యూనివర్సిటీ అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాస రావు
- నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే, కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో భారీ సదస్సు
- నార్సింగి శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులకు అవగాహన
- పెద్ద ఎత్తున పాల్గొన్న విద్యార్థులు

మణికొండ, ఫిబ్రవరి 16 : పోటీ ప్రపంచంలో విద్యార్థులు ముందస్తు లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత చదువుల వైపు పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేఎల్ యూనివర్సిటీ ఆల్ ఇండియా అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాస రావు పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కేవీఎంఆర్ ప్రైడ్ గార్డెన్స్‌లో శుక్రవారం సాయంత్రం నార్సింగిలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులతో ''కేఎల్ యూనివర్సిటీ, నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే'' ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యావకాశాలు అనే అంశంపై 'లక్ష్యం-2024' పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్ డా.జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటర్ పూర్తైన తర్వాత ఉన్నత ఉద్యోగావకాశాలకు ఎలాంటి ఉన్నత చదువులు ఎక్కడ చదవాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో విద్యార్థులు సుస్థిరమైన లక్ష్యాలను తీసుకుని ఎక్కడ చదివితే తమ లక్ష్యాలు నెరవేర్చడం సాధ్యమవుతుందనే అంశాలను వెల్లడించారు. ఉన్నత చదువులు, మెరుగైన ఉద్యోగావకాశాలను పొందాలనుకునే విద్యార్థులు కేఎల్ యూనివర్సిటీని ధీమాగా ఎంచుకోవచ్చన్నారు. ఇంటర్ తర్వాత డిగ్రీ నాలుగేండ్లు కష్టపడి చదివితే ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకొని 40 ఏండ్లు సుఖంగా జీవించే అవకాశాలు ఉంటాయన్నారు. కేఎల్ యూనివర్సిటీలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేఎల్ యూనివర్సిటీలో డిగ్రీ(బీ.టెక్) చదివే విద్యార్థులకు ఒకేసారి రెండు కోర్సులను (డ్యూయల్ డిగ్రీ) చదివేలా అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. ప్రధానంగా బీటెక్ ఇంజినీరింగ్ విద్యార్థులకు సీఎల్ఈ బ్రాంచ్ ఒక్కటే ప్రామాణికం కాదన్నారు. సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్, మెకానికల్ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు కూడా బీటెక్ రెండవ సంవత్సరంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదివి ఉన్నత ఉద్యోగాలు పొందే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ప్రస్తుతం పెద్ద పెద్ద ఇండస్ట్రీలలో మల్టీ డిసిప్లీనరి (బహుళ క్రమశిక్షణ) డిగ్రీ చదివిన వారికే అవకాశాలు అధికంగా వస్తున్నాయని చెప్పారు కేఎల్ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులు అత్యధికంగా 60లక్షల వేతనం తీసుకుంటున్నారని తెలిపారు. అదేవిధంగా తమ యూనివర్సిటీలో రెండేండ్లు చదువుకున్న విద్యార్థి మిగతా రెండేండ్లు, మూడేండ్లు చదువుతున్న విద్యార్థి చివరి ఏడాది విదేశాల్లో తమకు అనుబంధంగా ఉన్న యూనివర్సిటీలో చదువుకునే అవకాశాన్ని కేఎల్ యూనివర్సిటీ మాత్రమే కల్పిస్తుందన్నారు. తమ యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు ఐదు ఫారెన్ లాంగ్వేజీలను ఉచితంగా నేర్పిస్తున్నట్లు తెలిపారు. జేఈఈలో 95శాతం పర్సంటైజ్ సాధించిన వారికి కేఎల్ యూనివర్సిటీలో ఉచితంగా సీటును కేటాయిస్తుందన్నారు. కేఎల్ యూనివర్సిటీలో జేఈఈ బేసిక్ ఎగ్జామ్ ఆన్‌లైన్-ఆఫ్‌లైన్‌లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి శ్రీచైతన్య కళాశాల ఏజీఎం డి.వెంకటేశ్వర్లు, నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే అడ్వర్టైజ్‌మెంట్ విభాగం ఏజీఎంలు రాజిరెడ్డి, రాములు, వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాస రావు, నార్సింగి శ్రీచైతన్య కళాశాల ఏజీఎం డి.వెంకటేశ్వర్లు, నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే అడ్వర్టైజ్‌మెంట్ విభాగం ఏజీఎంలు రాజిరెడ్డి, రాములు, వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు



సదస్సుకు హాజరై మాట్లాడుతున్న కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాస రావు



నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే, కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు హాజరైన విద్యార్థులు

## ఉజ్వలమైన భవిష్యత్తుకు సరియైన దారి

ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కేఎల్ యూనివర్సిటీ యాజమాన్యం నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి. యూనివర్సిటీ ద్వారా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం వారి ప్రమోషన్‌లో భాగమే అనుకున్నాను. కానీ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఇంటర్మీడియట్ తర్వాత డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థుల కోసం ''నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే దినపత్రిక''లు కేఎల్ యూనివర్సిటీతో కలిసి కొంతకాలంగా అవగాహన సదస్సును నిర్వహిస్తున్నాయి. ఇలాంటి సదస్సుల ద్వారా విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తుకు సరియైన మార్గం దొరుకుతుంది. ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత ఏఏ కోర్సులలో చేరితే ఎలాంటి ప్రయోజనాలు కల్గుతాయనే అంశాలను కేఎల్ యూనివర్సిటీ యాజమాన్యం స్వచ్ఛందంగా సదస్సులను నిర్వహిస్తుండటం ఎంతో ఆదర్శనీయమైన నిర్ణయం. కమర్షియల్ సొసైటీ కాంపిటీషన్‌లో విద్యార్థులు కాన్ఫిడెన్స్, కమిట్మెంట్, కమర్షియల్‌గా ముందుకు సాగాలి. కేఎల్ యూనివర్సిటీ వారి పనితీరును చూస్తే ఖచ్చితంగా విద్యార్థులను ఉన్న తస్థాయికి చేర్చేందుకు శక్తివంచనలేకుండా పాటుపడుతుందని తెలుస్తుంది. ఖచ్చితంగా ఇలాంటి యూనివర్సిటీలలో విద్యార్థులు చేరితే వారి ఉజ్వల భవిష్యత్తు ఉన్నత శిఖరాలవైపు వెళ్తుందనడంతో ఎలాంటి అతిశయోక్తి లేదు.

*- డి.వెంకటేశ్వర్లు, శ్రీ చైతన్య కళాశాలల ఏజీఎం, నార్సింగి క్యాంపస్*



### ఇంటర్మీడియట్ తర్వాత ఏం చదవాలో తెలుసుకున్నాం

కేఎల్ యూనివర్సిటీ నిర్వహించిన అవగాహన సదస్సు ద్వారా ఇంటర్ తర్వాత ఏం చదవాలో తెలుసుకున్నాం. భవిష్యత్తులో ఏవిధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై మంచి అవగాహన అందించారు. అత్యధిక ప్యాకేజీ పొందే కంపెనీలో స్థానాన్ని దక్కించుకునేందుకు ఇలాంటి సదస్సులు మాలాంటి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

*-కె.నూతన్, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి*

### చాలా చక్కటి సదస్సు.. ఎంతో ఉపయోగకరమైనది

కేఎల్ యూనివర్సిటీ, ప్రముఖ దినపత్రికలు నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడేలతో కలిసి విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న అవగాహన సదస్సు మాలాంటి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. భవిష్యత్తులో ఎలాంటి కోర్సులు తీసుకుని చదవాలి. చదివిన తర్వాత కలిగే ప్రయోజనాలు ఎలా ఉంటాయనే అంశాలను స్పష్టంగా తెలుపడం మాకు సంతోషంగా ఉంది. అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ఇదో చక్కటి అవకాశం.

*-శశాంక్, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి*



### కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల కింద 60 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అందజేశారు. బంజారాహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యాలయంలో చెక్కులు అందజేసిన అనంతరం, మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ, పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులకు ఈ పథకాలు ఎంతో ఊరట ఇస్తున్నాయన్నారు.

*– బంజారాహిల్స్, ఫిబ్రవరి 16*



సోమాజిగూడలోని మలబార్ గోల్డ్స్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన వీరాజ్ రాయల్ పోల్కీ జువెల్లరీ ప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ ప్రదర్శనను మేనేజర్ అజయ్, పోల్కీ కలెక్షన్ ఇన్‌చార్జి గోరక్‌నాథ్ ప్రారంభించారు. ఈ నెల 25 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. *– ఖైరతాబాద్*

### ఐదు రాష్ట్రాల రుచులతో ఫుడ్ ఫెస్టివల్



ఐదు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన నోరూరించే వంటకాలు నగరవాసులకు విందు చేస్తున్నాయి. జూబ్లీహిల్స్ రోడ్ నం.45లోని 'ఐదు' రెస్టారెంట్‌లో వెరైటీ ఫుడ్ ఫెస్టివల్‌ను శుక్రవారం ప్రారంభించారు. తమిళనాడు, కేరళ, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వైవిధ్యమైన వంటకాలను అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మీన్ పొల్లిచట్టు, చింతకాయ కోడి కబాబ్, కుట్టు పరోటా, మంగోలియన్ ఫిష్ కర్రీ, పనీర్ చెట్టినాడ్, తెంగ్రెపాల్ కోడి బిర్యానీ తదితర వంటకాలు ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు.

*– బంజారాహిల్స్, ఫిబ్రవరి 16*



సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇరానియన్ ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకున్నది. ఫెస్టివల్‌లో ఆ దేశానికి సంబంధించిన సంప్రదాయ వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ఈ ఫెస్టివల్‌ను ఇరాన్ డిప్యూటీ కాన్సులేట్ జనరల్ మోసిన్ ముఖద్దమ్ ప్రారంభించారు. *– ఖైరతాబాద్*

## కన్నుల పండువగా పెద్దమ్మ తల్లి రథోత్సవం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 16: జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ ఆలయం వార్షిక రథ మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంతో పాటు రథ సప్తమి కావడంతో అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నగరం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో పెద్దమ్మ గుడిలో సందడి నెలకొంది. శుక్రవారం ఉదయం 8గంటలకు నవగ్రహ, చండీ హోమం, మధ్యాహ్నం బలిహరణం, రథ పూజ, పూర్ణాహుతి, కలశోద్వాసన తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేలాది మంది భక్తుల జయ జయ ధ్వానాల మధ్యన శ్రీ పెద్దమ్మ తల్లి ఉత్సవమూర్తిని రథంపై చేర్చి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష బాణసంచా విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయ ఫౌండర్ ట్రస్టీలు పి.ఇందిరా జనార్దన్ రెడ్డి, పి.విష్ణువర్ధన్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, ఆలయ ఈవో శ్రీనివాసరాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి వార్షికోత్సవాల్లో భాగంగా బలిహరరణం కార్యక్రమం

### భాషా పండితుల గీతం ఆవిష్కరణ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 16: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో గేయ రచయిత భాషా పండితులు రాంబాబు రచించిన 'భాషా పండితుల గీతం' సీడీనీ శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకర్ రెడ్డి, పార్వతి సత్యనారాయణ, గేయ నిర్మాత వివేక్ భవానితో కలిసి ఆవిష్కరించారు. హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సాంకేతికంగా ఎంతో ఉన్నతి సాధించినా మాతృభాషకు ఉన్న విశిష్టత ఎంతో ఉన్నతమైందన్నారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ అబ్దుల్లా, గుళ్లపల్లి తిరుమల కాంతి కృష్ణలు మాట్లాడుతూ, భాషా పండితుల సమస్యలపై సీఎంకు పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, అమీర్ పాషా, లక్ష్మప్ప, సాబీర్ పాషా, వీఎస్సెస్స్ శర్మ, వి.శ్రీనివాస్, బాలాజీ, లక్ష్మినారాయణ, దినకర్, డా.వినయ్ భాస్కర్ పాల్గొన్నారు.



## కార్మికుల హక్కుల కాల రాస్తున్న మోదీ గద్దె దిగాలి



శంషాబాద్ పట్టణంలో ర్యాలీ అనంతరం సభలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేష్, తదితరులు



ఆరాంఘర్ చౌరస్తాలో కార్మికులతో కలిసి ధర్నా చేస్తున్న ఏఐటీయూ కార్మిక విభాగం నాయకులు



కాటేదాన్ చౌరస్తాలో నిరసన ర్యాలీ చేపడుతున్న కార్మికులు, నాయకులు



నార్సింగి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకుల నిరసన

కార్మికుల హక్కుల కాల రాస్తున్న బీజేపీ మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని నగరం, చుట్టూరా ఉన్న గ్రామాలలో గ్రామీణ భారత్ బంద్‌ను శుక్రవారం విజయవంతంగా నిర్వహించి కార్మికులు, సీఐటీయూ నేతలు పెద్ద పెట్టున నినదించారు. గత పదేండ్ల బీజేపీ పాలనలో కార్మికులు, అట్టడుగు వర్గాలకు తీరని అన్యాయం జరిగిందని మోదీ ప్రభుత్వానికి ఇంక నూకలు చెల్లవని కార్మికులు, రైతులు, ఏఐటీయూ నాయకులు, నగరంలో పలు చోట్ల నిరసన తెలుపుతూ బైక్ ర్యాలీలు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ కార్మికులకు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని పలు కూడళ్లలో బీజేపీ, నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు.








